

సాక్షి
బాపట్ల
మంగళవారం । 21 । జనవరి । 2025



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 559.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,019 క్యూసెక్కులు విడుదలవుతోంది.

హుండీ ఆదాయం రూ.2,44,621



అల్లూరు(కర్లపాలెం): అల్లూరులోని రాజ్య లక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. రూ.2,44,621 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎంబీఎస్ వర్మ తెలిపారు.

న్యూస్‌రీల్

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి



బాపట్ల: రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ జైలును న్యాయమూర్తి సోమవారం పరిశీలించారు. ఆహారం, నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. రిమాండ్ ముద్దాయిలు ఎన్ని రోజులుగా ఇక్కడ ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్న హక్కులను వివరించారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలు న్యాయవాదులను నియమించుకోలేకపోతే మండల న్యాయసేవ ఆధ్వర్యంలో సాయం అందిస్తామని చెప్పారు. న్యాయమూర్తితోపాటు జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, బాపట్ల సీఐ రాంబాబు, పారా లీగల్ వలంటీర్ కె.రాజారావు ఉన్నారు.

పరిసరాల శుభ్రతతోనే అంతా ఆరోగ్యం

జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్ వెల్లడి



బల్లికురవ: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్ వెల్లడించారు. సోమవారం గుంటుపల్లి గ్రామంలోని వీధుల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. మురుగు నిల్వలు, వ్యర్థాల కుప్పలను ఎక్కడపడితే అక్కడ పడేయటం వల్ల దోమలు ఉత్పత్తితో సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అంతకు ముందు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్ర పరిసరాలను పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. అనంతరం పీహెచ్‌సీలో పలు రికార్డులు పరిశీలించారు. జలుబు, దగ్గు, జ్వరాలు సోకితే తక్షణమే వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలని, గ్రామాల్లో పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ మలేరియా సబ్ యూనిట్ అధికారి అర్జున్‌రావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి మిర్చి యార్డులో రైతులకు ఉచిత భోజనం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అమానత్ పట్టీలు ఆధారంగా రైతులకు ఉచిత భోజనం టోకెన్లు జారీ చేస్తామని తెలిపారు. ఉచిత భోజన కేంద్రం వద్ద సిబ్బందిని కేటాయించి, వారికి శిక్షణ కూడా ఇచినట్లు తెలిపారు.

యార్డుకు 90,567 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 90,567 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 77,096 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,200 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.16,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 54,523 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

ప్రజల వద్దకే మద్యం

మద్యం అమ్మకాలలో కొత్త పోకడలు

- ఇప్పటికే ఊరూరా బెల్టు షాపులు
- కొన్ని గ్రామాల్లో 3 నుంచి 4 దుకాణాలు
- యద్ధనపూడి మండలం పూనూరులో 16 షాపులు
- జిల్లా వ్యాప్తంగా రెండు వేలకుపైగానే..
- తాజాగా తిరునాళ్లు, జాతరల వద్ద తాత్కాలిక దుకాణాల ఏర్పాటు
- పర్చూరు, రేపల్లె, చీరాల, వేమూరు నియోజకవర్గాల్లో డోర్ డెలివరీ
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ



చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం బరి వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ మద్యం దుకాణం(ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెడితే మన ఇంటికే టిఫిన్, భోజనం పార్సిల్ రావడం చూశాం..జిల్లాలో మద్యం దుకాణదారులు కూడా ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. ఆటోలు, బైకులపై మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. అంతేగాక తిరునాళ్లు, జాతరలు ఎక్కడ జరుగుతుంటే అక్కడ తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం అమ్ముతున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన కోడి పందేల బరుల వద్ద దుకాణాలు ఏర్పాటుచేసి మద్యం విచ్చలవిడిగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఇప్పటికే ఒక్కొక్క గ్రామంలో నాలుగు నుంచి 10 వరకు బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం ఏరులై పారిస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులుకానీ, సివిల్ పోలీసులుకానీ వాటివైపు కన్నెత్తి చూడడం లేదు. కూటమి నేతలు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

బాబును పట్టించుకోని తమ్ముళ్లు

బెల్టు షాపు ఏర్పాటు చేస్తే సహించేది లేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిస్తున్నా ఆయనను తెలుగు తమ్ముళ్ల ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. జిల్లా వ్యాప్తంగా గ్రామానికి మూడు నుంచి నాలుగు బెల్టు షాపులు ఏర్పాటుచేసి మద్యం అమ్ముతున్నారు. యద్దనపూడి మండలం పూనూరులో ఏకంగా 16 బెల్టుషాపులు ఏర్పాటు చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జేబులు నింపుకోవడమే లక్ష్యంగా మద్యం ఏరులై పారిస్తున్నారు.

బరుల వద్దే మొబైల్ మద్యం షాపులు

సంక్రాంతి పండుగ సందర్భంగా పచ్చ నేతలు జిల్లా వ్యాప్తంగా జరిగిన కోడి పందేలు, ఇతర జూద క్రీడలు నిర్వహించారు. బరుల వద్ద మొబైల్ మద్యం దుకాణాలు నెలకొల్పడం చర్చనీయాంశంగా మారింది. వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో నెలకొల్పిన పెద్ద బరుల వద్ద మొబైల్ మద్యం దుకాణాలతోపాటు పదుల సంఖ్యలో బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. సంక్రాంతి పండుగ మూడురోజుల్లో అదనంగా రూ.కోట్లలో మద్యం వ్యాపారం జరిగినట్లు సమాచారం. మొబైల్ మద్యం షాపులు ఏర్పాటు చేసి



భట్టిప్రోలు మండలం పల్లెకోన బరి వద్ద ఏర్పాటు చేసిన మొబైల్ మద్యం దుకాణం(ఫైల్)

మద్యం అమ్మకాలు సాగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మామూళ్ల మత్తులో అధికారులు

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 2,500లకు పైగా బెల్టుషాపులు ఏర్పాటుచేశారు. ఎక్సైజ్ అధికారులు, కొందరు సివిల్ పోలీసు అధికారులు మొబైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రత్యేక అనుమతులిచ్చారు. వీరి నుంచి పెద్ద ఎత్తున్న మామూళ్లు పుచ్చుకున్నట్లు కొందరు మద్యం వ్యాపారులు ఆరోపిస్తున్నారు. జనవరితో సంక్రాంతి హడావుడి ముగిసినా ఫిబ్రవరిలో వేమూరు, రేపల్లె, బాపట్లతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తిరునాళ్లు, జాతర్లు, శివరాత్రి పండుగలున్నాయి. దీంతో ఎక్కడికక్కడ మొబైల్ మద్యం షాపులు, వాటికి అనుబంధంగా బెల్టు దుకాణాలు ఏర్పాటుచేసేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మొబైల్ మద్యం దుకాణాలను అరికట్టి ఇంటింటికి మద్యం సరఫరా కార్యక్రమానికి అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ సారించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. మా సమస్యలు పరిష్కరించండంటూ బాధితులు అర్జీల ద్వారా జిల్లా కలెక్టర్‌కి విన్నవించారు. వినతపత్రాలను పరిశీలించిన కలెక్టర్ కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. పీజీఆర్ఎస్‌లో 145 అర్జీలు నమోదయ్యాయి. జిల్లా పశుసంవర్ధక శాఖ ద్వారా చేపడుతున్న 'ఉచిత పశు ఆరోగ్య శిబిరాల' వాల్‌పోస్టర్‌లను కలెక్టర్ విడుదల చేశారు. ఈనెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన 2025 సంవత్సరం డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు ఉచితంగా భోజనం సదుపాయం కల్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధికారులు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అన్నారు. పంచాయతీశాఖలో 28 అర్జీలు పెండింగ్‌లో ఉంటే ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. మున్సిపాలిటీ, వివిధ శాఖల్లోనూ పెండింగ్‌లో ఉండడంపై ఆయన ఆరా తీశారు. పెండింగ్ అర్జీలపై పూర్తి స్థాయిలో ఆడిట్ చేయాలని, గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కుల గణన సర్వేలో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై వీక్షణ సమావేశం ద్వారా మండల అధికారులతో సమీక్షించారు. బాపట్ల మండలంలో 22 అర్జీలు, బల్లికురవలో ఐదు, చీరాల పట్టణంలో మూడు, గ్రామీణ ప్రాంతంలో నాలుగు అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చిన 156 అర్జీలను సత్వరమే పరిష్కరిస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని, సంబంధిత అధికారులకు యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. అర్జీల పరిష్కారం తదుపరి సంబంధిత ప్రజాప్రతినిధులకు సమాచారం పంపాలని ఆదేశించారు. ప్రతి సోమవారం పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇవ్వడానికి సుమారు 200 మంది వస్తున్నారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిని ఆదేశించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు రెడ్‌క్రాస్ సంస్థ భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఎంఎస్ఎంఈ విద్యుత్ సర్వీసుల సర్వేలో మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్‌పీసీఐ లింకేజీ, వలస కూలీ లు సర్వేలపై సమగ్రంగా సమీక్షిస్తామన్నారు. విశేష సేవలు అందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థలో సభ్యత్వ నమోదు బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి మండలంలో 50 మందికి తగ్గకుండా ఎంపీడీఓలు సభ్యత్వ నమోదు చేయించాల న్నారు. సభ్యత్వం పొందే ప్రతి ఒక్కరూ రూ.1,100 చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నా రు. రెడ్‌క్రాస్‌లో చేరిన వారికి జీవితకాల సభ్యత్వ కార్డును అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో డి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా పాల్గొన్నారు.

హేతువాద కవిరాజు

- రచనలతో సమాజాన్ని మేల్కొల్పిన కొండవీటి వెంకటకవి
- వెంకటకవి క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు
- సుప్రసిద్ధ రచయిత, హేతువాది, ఉపన్యాసకుడిగా ప్రఖ్యాతి
- 25న జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం



కవిరాజు కొండవీటి వెంకటకవి (ఫైల్)

క్రోసూరు: దేశవ్యాప్తంగా మతతత్వం పెచ్చురిల్లుతున్న నేటి తరుణంలో కలాన్ని ఖడ్గంగా చేసుకుని, తన జీవితాన్నే ఆయుధంగా మలిచి సంఘ సంస్కరణకు పూనుకున్న సాహితీవేత్త, హేతువాది, అభ్యుదయవాది, మహాకవి కొండవీటి వెంకటకవి. ఆయన పల్నాడు జిల్లా క్రోసూరు మండలం విప్పర్ల వాస్తవ్యులు. కొండవీటి వెంకటకవి అసలు పేరు కొండవీటి వెంకటయ్య, తల్లిదండ్రులు నారాయణ, శేషమ్మలు. 1918 జనవరి 25న ఆయన జన్మించారు. ఈయన సతీమణి పేరు చిన్నమ్మ, వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.

వెంకటకవి రచనలు..

వెంకటకవి తన 14వ ఏట నుంచి రచనలు చేయటం ప్రారంభించారు. 1932లో కర్షక శతకాన్ని రాశారు. అనంతరం హితబోధ, చెన్నవ కేశవ శతకం, 1954లో నెహ్రూ చరిత్ర మొదటి భాగం రచించి బెజవాడగోపాలరెడ్డికి, ద్వితీయభాగం గుత్తికొండ నరహరికి అంకితం చేశారు. త్రిశతి పేరుతో బుద్ధుడు, వేమన, గాంధీజీల గురించి మూడు శతకాలు రచించారు. 1984లో పోతులూరి బ్రహ్మం మఠానికి ఆస్థానకవిగా ఉంటూ శ్రీ వీర బ్రహ్మేంద్ర సుప్రభాతాన్ని సంస్కృతంలో రచించారు. 1977లో అగ్రనటుడు నందమూరి తారక రామారావు తీసిన దానవీరశూరకర్ణ సినిమాకు సంభాషణలు రాశారు. అలా చలన చిత్ర రంగానికి పరిచమయ్యారు. ఆ తరువాత శ్రీమద్విరాటపర్వం, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి చరిత్ర చిత్రాలకు సంభాషనలు రాశారు. వీరు రచించి గ్రంథాలన్నీ కవిరాజు గ్రంథ మాల పేరుతో స్వయంగా ప్రకటించినవే కావటం విశేషం. అప్పట్లో ఎంఎస్ స్ఫూర్తితో, కమ్యూనిస్టు భావజాలంతో బాబాలను విమర్శిస్తూ ఉపన్యాసాలిచ్చారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి భావజాలంతో హేతువాదిగా మారి అనేక రచనలు చేశారు. మంత్రాలు లేకుండా త్రిపురనేని రామస్వామి రాసిన పెళ్లి సూత్రాలు చదివి అనేక వివాహాలు చేయించారు.

పురస్కారాలు..

1953లో గుంటూరు జిల్లా పెదకూరపాడులో వీరికి కవిరాజుగా బిరుదు ప్రధానం చేసి సత్కరించారు. 1971లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కళాప్రపూర్ణ పురస్కారం. 1979 వెంకటకవి కవితా బ్రహ్మోత్సవాన్ని డాక్టర్ కొడాలి రంగారావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా సత్తెనపల్లిల్లో నిర్వహించారు. ఎడ్లబండి కట్టి అంగరంగ వైభవంగా సినీనటులు ఎన్టీ రామారావు, కొంగర జగ్గయ్య లతో పాటు వెంకటకవిని సత్తెనపల్లి పురవీధుల్లో ఊరేగించి అశేష జనవాహిని సమక్షంలో పౌరసత్కారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంకటకవిని అధికార భాషా సంఘ సభ్యులుగా నియమించింది. వెంకటకవి 1991 ఏప్రిల్ 7న కాలం చేశారు. వెంకట కవి లాంటి గొప్ప రచయిత, హేతువాదిని తెలుగు ప్రజలు, నేటి విద్యార్థులు, యువత జ్ఞప్తికి చేసుకోవాల్సిన అవసరం ఉంది.

శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ పోలీస్ పాత్ర కీలకం

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



ఏఆర్ పోలీసులకు సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్

బాపట్ల: శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది విధులు కీలకమని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ఏఆర్ పోలీస్ సిబ్బందికి రెండు వారాల 'మొబలైజేషన్' కార్యక్రమాన్ని సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో అడిషనల్ ఎస్పీ ప్రారంభించారు. సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై పోలీస్ విధులు సమర్థంగా నిర్వహించడానికి తగిన మెళకువలు సూచించడంతో పాటు వ్యక్తిగత జీవితంలో కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యం, తగిన సమయం కేటాయింపు, ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ విధులు నిర్వహించే విధానంపై అడిషనల్ ఎస్పీ వివరించారు. పోలీస్ ఉద్యోగ బాధ్యతలు సమర్థంగా నిర్వహించేందుకు కఠినమైన శిక్షణ, తగిన మెళకువలను శిక్షణ సమయంలో నేర్పడం జరుగుతుందన్నారు. ఇతర ఉద్యోగాలతో పోలిస్తే పోలీసు ఉద్యోగం భిన్నంగా ఉంటుందన్నారు. పోలీసులు చేసే ప్రతి పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో మెలగడం కీలకమన్నారు. వృత్తి రీత్యా పోలీస్ శాఖలో చోటుచేసుకుంటున్న నూతన మార్పులను అందిపుచ్చుకునే విధంగా ఏఆర్ సిబ్బందికి ప్రతి ఏడాదీ మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని మరింత సమర్థంగా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీలను పరిశీలించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 58 మంది ఫిర్యాదిదారులు వారి సమస్యలను అడిషనల్ ఎస్పీకి విన్నవించుకున్నారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పి.జి.ఆర్.ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సభ్యత్వం నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: అసంఘటిత రంగ కార్మికులందరికీ అధికారులు ఉచిత ప్రమాద బీమా సభ్యత్వ నమోదు చేయించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. వివిధ సంక్షేమ పథకాల అమలుపై జిల్లా అధికారులతో కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పోర్టల్ ద్వారా ప్రమాద బీమా ఉచిత సభ్యత్వ నమోదు చేయించాలని అన్నారు. 16 నుండి 60 ఏళ్ల లోపు వారంతా పేర్లు నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, వలస కార్మికులు, రిక్షా కార్మికులు, ఇళ్లలో పని చేసేవారు, మత్స్యకారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారంతా అర్హులేనన్నారు. విద్యార్థులు కూడా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. పేర్లను నమోదు చేసుకోదల్చినవారు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, కార్మిక శాఖ కార్యాలయంలోనూ, లేదా నేరుగా (ఇఎస్‌హెచ్ ఆర్ఎం.ఏపి.జీఓవి.ఇన్) ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం కింద 4,81,711 మందికి బీమా వర్తింప చేయాలని లక్ష్యంకాగా ఇప్పటికే 2,97,169 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన 1,84,542 మంది అసంఘటిత కార్మికులను నమోదు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో డి.గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిస్టెన్స్ డిగ్రీ కోర్సుల ఫలితాలు



ఏఎన్‌యూ(గుంటూరుఈస్ట్): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ గతేడాది అక్టోబర్/నవంబర్ నెలల్లో నిర్వహించిన పలు డిగ్రీ కోర్సుల ఫలితాలను విడుదల చేసినట్లు దూరవిద్య పరీక్షల డెప్యూటీ రిజిస్ట్రార్ సయీద్ జైన్ లాబ్దీన్ సోమవారం తెలిపారు. ఫలితాల సీడీని యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. వీసీ కె.గంగాధరరావు మాట్లాడుతూ బీఏ 4వ, ఐదో సెమిస్టర్, బీకాం (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), 4, 5 సెమిస్టర్లు, బీబీఏ కోర్సుల 4,5 సెమిస్టర్ల రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు వెల్లడించారు. జైన్ లాబ్దీన్ మాట్లాడుతూ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఫిబ్రవరి 3లోగా ఒక్కొక్క పేపర్‌కు రూ.770 చెల్లించి, దరఖాస్తులను దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి అందేలా పంపాలని సూచించారు.

కదంతొక్కిన న్యాయవాదులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న న్యాయవాదులు

- న్యాయవాదిపై పొన్నూరు పోలీసుల దాడికి ఖండన
- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం

గుంటూరువెస్ట్: పొన్నూరు పోలీసులు దళిత న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేశారు. సుమారు వందకు పైగా న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది శాంతకుమార్, కేకేలు మాట్లాడుతూ గత నెల 25న పొన్నూరులో న్యాయవాది బి.ప్రకాశరావు తన స్నేహితులకు చికిత్స ఎందుకు చేయడంలేదని వైద్యులను ప్రశ్నించినందుకు సీఐ రవికిరణ్, ఎస్ఐ రాజకుమార్, కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్లో దారుణంగా కొట్టారన్నారు. ప్రకాశరావుకు తీవ్ర గాయాలయ్యాయని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజల క్షేమం కోసం పని చేయాల్సిన పోలీసులు రక్తం కారేలా ఓ న్యాయవాదిని కొట్టడం అన్యాయమన్నారు. ఇలా అయితే ప్రజలకు పోలీసులపై గౌరవం ఏముంటుందని ప్రశ్నించారు. దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వేములు ప్రసాద్, దేవరకొండ రోశయ్య, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫార్మా.డీ, బీ ఫార్మసీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్

డాక్టర్ వై.లక్ష్మణస్వామి



బాపట్ల: ఫార్మా.డీ, బీ ఫార్మసీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ వై.లక్ష్మణస్వామి పేర్కొన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వై.లక్ష్మణస్వామి పాల్గొని మాట్లాడారు. ఫార్మా.డీ కోర్సు క్లినికల్ ఫార్మాసిస్టుగా, కమ్యూనిటీ ఫార్మాసిస్టుగా వైద్యసేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడతారని తెలిపారు. చక్కగా చదువుకుని ఉన్నతశ్రేణి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఈ.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ జి.నాగార్జున, డాక్టర్ ఎం రంగనాథ రెడ్డి, డాక్టర్ టి.గోవర్ధన్‌రెడ్డి, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాస రావు, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ డి.వెంకయ్య చౌదరి, ట్రెజరర్ కోట వీరబ్రహ్మం, వైస్ ప్రెసిడెంట్‌లు వెంకట్రావు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై కమిషనర్ సానుకూల స్పందన



బాపట్ల: పంచాయతీరాజ్‌శాఖలోని ఉద్యోగుల సమస్యలపై ఆశాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ సానుకూలంగా స్పందించారని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు పల్నాటి శ్రీరాములు పేర్కొన్నారు. కమిషనర్ ఎం.కృష్ణతేజను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యల వినతిపత్రం అందించారు. కమిషనర్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు పులిపాటి అమ్మయ్య కూడా ఉన్నారు.

యువ కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పల్లపోలు



చినగంజాం: యువ కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన పల్లపోలు ఆంజనేయ తేజా నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు అతనికి సోమవారం రాష్ట్ర యువ కాపునాడు అధ్యక్షుడు పూల చైతన్యమోహన్ నుంచి ఉత్తర్వులు అందాయి. తేజా నాయుడు కళాశాల చదివే రోజులలో విద్యార్థుల యూనియన్‌లో ఉత్సాహంగా పాల్గొని పలు సమస్యలపై పోరాడాడు. కళల పట్ల, కళాకారుల పట్ల అతనికి ఆసక్తి ఎక్కువ. తేజా నాయుడును గ్రామ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలో శ్రీనివాసరెడ్డి ప్రతిభ



అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డి గీసిన సంక్రాంతి సంబరాల చిత్రం

చినగంజాం: అంతర్జాతీయ చిత్రలేఖన పోటీలో చినగంజాంకు చెందిన సూరిన శ్రీనివాసరెడ్డి మూడో బహుమతి సాధించాడు. కోనసీమ చిత్ర కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఆదివారం 35వ అంతర్జాతీయ చిత్రకళా బ్రహ్మోత్సవాలు 2025 నిర్వహించారు. ఇందులో భాగంగా తృతీయ బహుమతిగా' మెగా బ్రహ్మోత్సవం' అవార్డు సాధించాడు. సంక్రాంతి పండుగ సంబరాలను ప్రతిబింబిస్తూ శ్రీనివాసరెడ్డి గీసిన చిత్రానికి మూడో బహుమతి లభించింది. విజేతలకు కోనసీమ జిల్లా అమలాపురంలో సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వాహకులు కొరసాల సీతారామస్వామి చేతుల మీదుగా శ్రీనివాసరెడ్డి అవార్డు అందుకున్నారు. శ్రీనివాసరెడ్డిని శాలువాతో సత్కరించి మెమెంటో, సర్టిఫికెట్, దేశ స్థాయిలో ప్రసిద్ధి చెందిన చిత్రలేఖన కళాకారులు 250 మందితో కూడిన ఆల్బం ప్రదానం చేశారు. దీంతోపాటు 2024లో అంతర్జాతీయ స్థాయిలో శ్రీనివాసరెడ్డి గీసిన 'కృష్ణవందే జగద్గురు' చిత్రానికి చిత్రమిత్ర 2024 అవార్డు గెలుచుకోగా ఇదే వేదికపై అతనికి అందజేశారు. చిత్ర లేఖనంలో అంతర్జాతీయ అవార్డు గెలుచుకున్న శ్రీనివాస రెడ్డిని జిల్లా చిత్రకారుల సంఘం అధ్యక్షుడు బండారి త్యాగరాజు, కార్యదర్శి అచ్యుత శ్రీనివాస్(మణి ఆర్ట్స్)లు అభినందనలు తెలిపారు.

టెక్నీషియన్లు సమర్థంగా ల్యాబ్‌లు నిర్వహించాలి

శిక్షణను ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి

నరసరావుపేట: జిల్లాలోని పలు ప్రభుత్వ హాస్పిటళ్లు, హెల్త్ సెంటర్లలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు రక్తపరీక్షల నిర్వాహణకు మెలకువలను నేర్చుకొని మలేరియా నిర్ధారణ సక్రమంగా చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. సోమవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో ప్రైమరీ, అర్బన్, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, హాస్పిటళ్లలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లకు వారం రోజులపాటు నిర్వహించే ఓరియంటేషన్ ట్రెనింగ్‌ను ప్రారంభించారు. ఈ శిక్షణను డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి ప్రారంభించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ వారం రోజులపాటు ఇచ్చే శిక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు పకడ్బందీగా తర్ఫీదు పొంది ల్యాబ్‌లను సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

అంతర్ రాష్ట్ర బైకు దొంగ అరెస్ట్

వేలిముద్ర స్కానర్ ఆధారంగా పట్టుకున్న పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న నగరంపాలెం సీఐ నజీర్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేసే అంతర్ రాష్ట్ర దొంగను వేలిముద్ర స్కానర్ ఆధారంగా నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎం.నజీర్ కేసు వివరాలను వెల్లడించారు. హనుమయ్యనగర్‌కు చెందిన మాదాల సురేష్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 15న రాత్రి తన ఇంటి ముందు ద్విచక్రవాహనం పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో మరో రెండు ద్విచక్రవాహనాలు చోరీకి గురికావడంతో అదనపు ఎస్పీ సుప్రజ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసుల సహకారంతో నగరంపాలెం సీఐ నజీర్ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నగరంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్తులను విచారించారు. థంబ్ ప్రింట్ (వేలిముద్ర) స్కానర్ ద్వారా విచారణ చేపట్టారు. దీని ఆధారంగా వాహనాలు చోరీ చేసింది దేవాపురానికి చెందిన పులి రమేష్‌గా గుర్తించి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. రమేష్ నుంచి ఐదు ద్విచక్రవాహనాలను రికవరీ చేశారు. రమేష్‌పై జిల్లాలోనే అనేక పోలీస్ స్టేషన్లలో 52 కేసులు ఉన్నట్లు గుర్తించారు. సోమవారం రమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రమేష్‌ను పట్టుకునేందుకు ప్రతిభ కనబరిచిన నగరంపాలెం సీఐ ఎం.నజీర్‌ను ఎస్సై సలాంను సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

తమ్ముడిపై కత్తితో అన్న దాడి



ఆరిఫ్

తాడేపల్లిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో తన భర్తపై కత్తితో దాడి చేసి కదల్లేని స్థితికి తీసుకొచ్చిన బావ, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని వేడుకున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఓ మహిళ విలేకరుల ఎదుట సోమవారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం ప్రకారం షేక్ ఆరిఫ్, ఆసిఫ్ అన్నాదమ్ములు. వీరి తల్లి షేక్ జమీల. ఆరిఫ్‌కు అన్న ఆసిఫ్ వదిన ఆయాషా, తల్లి షేక్ జమీలకు మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఆరిఫ్ భార్య సల్మా కాన్పు కోసం విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గతనెలలో చేరింది. ఆ సమయంలో ఆరిఫ్‌కు అతని వదిన ఆయాషా, అన్నయ్య ఆసిఫ్‌కు మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12న ఆసిఫ్ ఆరిఫ్‌ను కత్తితో విచక్షణ రహితంగా పొడిచాడు. అనంతరం ఆస్పత్రిలో చేర్పించి ఎవరికీ తెలియకుండా చికిత్స చేయించారు. అనంతరం తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచి బంధించారు. ఆరిఫ్ భార్య సల్మా ఆస్పత్రి నుంచి జనవరి 10న ఇంటికి వచ్చి కదల్లేని స్థితిలో ఉన్న భర్తను చూసి ఏమైందని ప్రశ్నించింది. దీంతో అత్త, బావ, తోడికోడలు బెదిరింపులకు దిగారు. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలని, లేకుంటే నిన్ను, నీ పిల్లలనూ చంపుతామంటూ బెదిరించారు. దీంతో సల్మా కదల్లేని స్థితిలో ఉన్న భర్త, 15రోజుల పసిగుడ్డుతో కలిసి పోలీసులను ఆశ్రయించారు. అయినా పోలీసులు కనికరం చూపలేదు. వారం రోజులుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కేసు నమోదు చేయలేదు. ఆదివారం విజయవాడకు చెందిన టీడీపీ కార్పొరేటర్ హర్షద్ వచ్చి సల్మా, ఆరిఫ్‌లను బెదిరించారు. ఇప్పటికే తీవ్రంగా గాయపడిన ఆరిఫ్‌కు మరో ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. దీంతో సల్మా విలేకరులను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని కన్నీమున్నీరయ్యారు.

జెస్సీరాజ్‌కు కలెక్టర్ అభినందన



గుంటూరు వెస్ట్: ప్రపంచ స్కేటింగ్ పోటీల్లో సత్తాచాటి, ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం అందుకున్న జెస్సీరాజ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. జెస్సీరాజ్ అద్భుత ప్రతిభతో జిల్లాకు, రాష్ట్రానికి పేరు తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్డీఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు సౌత్ డీఎస్పీగా భానోదయ బాధ్యతల స్వీకరణ

గుంటూరురూరల్: గుంటూరు సౌత్ డీఎస్పీగా జి.భానోదయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని సౌత్ డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. భానోదయ 2022 బ్యాచ్‌లో నియమితులయ్యారు. రాజమండ్రి ఈస్ట్ జోన్‌లో ప్రొబేషనరీ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అక్కడి నుంచి గుంటూరు సౌత్‌జోన్‌కు బదిలీపై వచ్చారు.

ముగ్గురిపై కత్తితో దాడి

చిట్టీల వివాదమే కారణం!

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చిట్టీ వివాదం నేపథ్యంలో ముగ్గురిపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన ఘటన సోమవారం జరిగింది. నగరంపాలెం పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీనగర్ ప్రాంతానికి చెందిన చల్లగొల్ల రమేష్ అదే ప్రాంతానికి చెందిన సింగయ్య ద్వారా రూ.లక్ష చిట్టీ వేశాడు. మూడు నెలలుగా రమేష్ డబ్బులు చెల్లించకపోవడంతో నిర్వాహకులు సింగయ్యకు ఫోన్‌చేసి రమేష్ డబ్బులు చెల్లించలేదని, మధ్యవర్తిగా ఉన్న నువ్వు చెల్లించాలని చెప్పారు. దీంతో ఆగ్రహంతో సింగయ్య రమేష్‌కు ఫోన్ చేసి అసభ్యపదజాలంతో తిట్టాడు. రమేష్ సోమవారం తన కుమారుడు యశ్వంత్, బావమరిది నాయుడును తీసుకుని సింగయ్య ఇంటికి వెళ్లి చిట్టీ డబ్బులు చెల్లించాడు. డబ్బు కట్టడంలో కొంత ఆలస్యమైనంతమాత్రాన ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టడం సరికాదని చెప్పారు. ఈ నేపథ్యంలో సింగయ్యకు, రమేష్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో సింగయ్య కుమారుడు మల్లికార్జునరావు ఇంట్లో ఉన్న కత్తితో రమేష్ కుమారుడు యశ్వంత్, నాయుడులపై కత్తితో దాడి చేశాడు. అడ్డు వచ్చిన రమేష్ తలపై దాడి చేశాడు. సమాచారం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సింగయ్య, మల్లికార్జునరావులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గాయాలపాలైన రమేష్, యశ్వంత్, నాయుడులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. పోలీసులు ఇరువు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్యాయత్నం

ప్రత్తిపాడు: చర్చి స్థలం ఆక్రమించి నిర్మిస్తున్న గోకులం షెడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నందుకు కొందరు గ్రామస్తులు తనపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగుమందు తాగాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో చెబుతూ, పురుగుమందును తాగుతూ తీసుకున్న సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ ఘటన ప్రత్తిపాడు మండలంలో జరిగింది.. సెల్ఫీ వీడియోలో బాధితుడు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.. ప్రత్తిపాడు మండలం కొండేపాడుకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలో గోకులం షెడ్డును నిర్మించుకుంటున్నాడు. ఆ స్థలంలో కొంత తన తాతలు దానంగా ఇచ్చిన చర్చి స్థలం ఉందని, గోకులం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని గ్రామానికి చెందిన దాసరి కల్యాణ్ కొద్దిరోజులుగా గ్రామ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాడు. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సమస్యను పరిష్కరించడం లేదు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కల్యాణ్‌ను దుర్భాషలాడాడు. కల్యాణ్‌తోపాటు అతని బంధువులపై అక్రమ కేసులు పెట్టారు. పోలీసులు ఆ కేసులు పట్టుకుని తనను వేధిస్తున్నారని, చర్చి స్థలం కోసం పోరాడుతున్న తనకు జరిగిన అవమానం భరించలేక పురుగుమందు తాగి చనిపోతున్నట్టు వీడియోలో వివరించాడు. అనంతరం పురుగుమందు తాగేశాడు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.

డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి నిర్బంధం

- గ్రామ సమైఖ్య నిధులు దుర్వినియోగం చేశారని మహిళలు ఆందోళన
- నిధుల దుర్వినియోగంపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చిన అధికారులు



ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి, సీసీ నాగకుమారిని నిర్బంధించిన డ్వాక్రా మహిళలు

నగరం: గ్రామ సమైఖ్య నిధులు స్వాహా చేశారని డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి, సీసీ నాగకుమారి, యానిమేటర్‌లను డ్వాక్రా మహిళలు నిర్బంధించిన సంఘటన సోమవారం నగరం గొడపాలెంలోని రామమందిరం వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. రామమందిరంలో డ్వాక్రా మహిళల సమావేశం నిర్వహించారు. సమావేశంలో డ్వాక్రా మహిళలు గ్రామ సమైఖ్య నిధుల వివరాల గూర్చి డీఆర్‌డీఏ అధికారులను నిలదీశారు. అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడం, సమాచారం కూడా ఇవ్వకపోవడంతో డ్వాక్రా మహిళలు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలోనే డ్వాక్రా మహిళలకు, అధికారులకు వాగ్వావాదం జరిగింది. డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి, సీసీ నాగకుమారి, యానిమేటర్‌లు ఫణి రాజకుమారిలను రామమందిరంలో ఉంచి గేట్లకు గడియ పెట్టి నిర్బంధించారు. గ్రామ సమైఖ్య నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇవ్వడంతో వారిని విడిచిపెట్టారు.

పాడైన పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

జే.పంగులూరు: ఓ ప్రైవేటు కంపెనీ కలుపు మందు వినియోగించగా దెబ్బతిన్న పంటను శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ముప్పవరం గ్రామ పరిసర ప్రాంత రైతులు అగస్త్య కంపెనీ కలుపుమందు పిచికారీ చేయగా మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్న విషయం విదితమే. పంట దెబ్బతిన్న పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. సంబంధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పొలాల్లో కలుపు మందు వాడి ఎదుగుదల లేని మొక్కలు, మోము ఎండిన మొక్కలను పరిశీలించి నమూనాలను తీసుకెళ్లారు. నష్టానికి గల కారణాలు మొక్కలను పరిశీలించి నివేదిక పంపుతామని గుంటూరు లాం ఫారం శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిభశ్రీ తెలిపారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కలుపు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని, కలుపు మందు పిచికారీ చేసే సమయంలో తప్పకుండా నిపుణుల సలహాలు తీసుకోవాలన్నారు. మందు మోతాదు, నీటి పరిమాణం తీసుకొని సూచించిన మేరకు పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ (ఆగ్రానమి) డాక్టర్ దయానా, గ్రేజ్ సైంటిస్ట్ (ఎంటమాలజీ), అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్టూరు కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులతో పాఠశాల బృందం

తాడేపల్లిరూరల్: బాలల హక్కులను పరిరక్షణే ధ్యేయంగా వ్యవస్థలన్నీ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు రాజేంద్రనాథ్, పద్మావతి సూచించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలోని మున్సిపల్ హైస్కూల్‌ను సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు మాట్లాడుతూ జీవితంలో ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషిచేయాలన్నారు. సోషల్‌మీడియాను పరిమితంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఆహారం వండే విధానం, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వం పిల్లల హక్కుల పరిరక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్. బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్. శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుమ్మకోటలో పులి గుర్తులు అవాస్తవం

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ



రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామ సమీపంలో నల్లమల అడవిప్రాంతంలో శనివారం కనిపించినవి పులి గుర్తులు కాదని ఫారెస్ట్ బీట్ అధికారి సత్యనారాయణ సోమవారం తెలిపారు. పల్నాడు జిల్లా తుమ్మకోట గ్రామ పరిసరాలలో నున్న నల్లమల అటవీప్రాంతంలో పెద్దపులి సంచరించి ఆవుదూడను చంపిందని ప్రజలు చర్చించుకున్నారని, దీంతో తుమ్మకోట గ్రామానికి చెందిన పశువుల కాపరి బాలునాయక్‌తో పాటు మరికొందరు గ్రామస్తులతో అడవిలోకి వెళ్లి ఆవులు మేతకోసం వెళ్లిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడ ఓ ప్రాంతంలో రాళ్ల మధ్య ఆవుదూడ కాలు ఇరుక్కొనిపోవడంతో ఆ ఆవుదూడకు తీవ్రగాయం కావడంతో అది పెద్దగా అరవడంతో భయపడిన పశుకాపరి, ఆవులు పారిపోయి పరుగెత్తడం జరిగిందన్నారు. అదే పెద్దపులి అయినా.. చిరుతపులి అయిన ఆవుదూడను చంపితీసుకొని వెళ్లిపోవడం జరిగేదన్నారు. కానీ ఇక్కడ రాళ్ల మధ్య కాలు విరిగి ఆవుదూడ అక్కడే కిందపడి ఉందన్నారు. ఈ ప్రాంతంలో పెద్దపులి, చిరుతపులుల గుర్తులు ఏవీ లేవన్నారు. అటవీశాఖ అధికారులు తుమ్మకోట గ్రామ సమీపంలో నున్న ఈ అడవిలో పులి లేదని నిర్ధారించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.